ప్రజలకు దసరా శుభాకాంక్షలు

ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 11: కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై.. మంచి సాధించిన విజయానికి గుర్తుగా నిర్వహించుకునే దసరా పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, చేపట్టే పనుల్లో విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

విజయదశమి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, అక్టోబర్ 11: శేరిలింగంపల్లి ప్రాంత ప్రజలకు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు, పాత్రికేయులకు, ఆత్మీయులందరికీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి గెలిచే విజయానికి ప్రతీకగా దసరా పర్వదినాన్ని ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కేపీహెచ్‌బీ కాలనీలో నేడు దసరా సంబురాలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 11: కేపీహెచ్‌బీ కాలనీ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా సంబురాలు నిర్వహించడం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్.ప్రితంరెడ్డి, పి.సాయినాథ్‌రెడ్డి తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని రమ్యాగ్రౌండ్‌లో శనివారం సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, రామ్‌లీలా ఉత్సవంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వేడుకల్లో కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా జేపీ జయంతి వేడుకలు

జయప్రకాశ్ నారాయణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని జయప్రకాశ్ నారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశంలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో జయప్రకాశ్ నారాయణ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకటసుబ్బయ్య, లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు కొమ్మినేని వికాస్, రామకృష్ణ, సుబ్బారావు, శ్రీనివాస్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. *–కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 11*

ఆటిజంతో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సాయం

కొండాపూర్, అక్టోబర్ 11:ఆటిజం సమస్యతో బాధపడుతున్న చిన్నారి నాగ సహస్రకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ రూ. 20వేల నగదును శుక్రవారం అందజేసింది. లింగంపల్లికి చెందిన నాగ సురేశ్ కూతురు సహస్ర గత రెండేండ్లుగా ఆటిజం సమస్యతో బాధపడుతుందని, ఆమె ఆరోగ్య ఖర్చుల నిమిత్తం తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపకుడు, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ నగదును తన కార్యాలయంలో చిన్నారి తండ్రి సురేశ్‌కు అందజేశారు. తన కూతురు చికిత్స నిమిత్తం దాతలు సాయం చేయాలని సురేశ్ ఈ సందర్భంగా కోరారు.

చిన్నారి తండ్రి సురేశ్‌కు నగదును అందజేస్తున్న విజయ్‌కుమార్

దుండిగల్ : మహాపూర్ణాహుతి యాగంలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: కనకదుర్గా ఆలయంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు

మహిషాసురమర్దినిగా అమ్మవారు

కొండాపూర్ : కొత్తగూడ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, నాయకులు, కార్యకర్తలు

దసరా శరన్నవరాత్రోత్సవంలో భాగంగా పూజలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. కేపీహెచ్‌బీకాలనీ, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో దుర్గామాత నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిచ్చారు. దీంతో ఆలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని కనకదుర్గా దేవాలయంలో కనకదుర్గా అమ్మవారికి మహిషాసురమర్దిని దేవిగా అలంకరించి పూజలు చేశారు. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల పరిధిలోని వివిధ దేవాలయాల్లో, మండపాల్లో వెలసిన అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. శనివారం అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించనున్నారు.

- కేపీహెచ్‌బీ కాలనీ/కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి జోన్ బృందం, అక్టోబర్ 11

శేరిలింగంపల్లి : జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో శ్రీమహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు

శేరిలింగంపల్లి : కొండాపూర్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో శ్రీమహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

కేపీహెచ్‌బీ కాలనీ: బాలాజీనగర్ డివిజన్‌లోని దుర్గామాత మండపంలో పూజలో కార్పొరేటర్ పగుడాల శిలీషాబాబురావు

బాలానగర్:అమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు

బాలానగర్ : అమ్మవారికి పూర్ణాహుతి పూజలో పాల్గొన్న భక్తులు

దుండిగల్ : కేటీఆర్ కాలనీలో అమ్మవారికి సమర్పించిన 108 ప్రసాదాలతో భక్తులు

దుండిగల్ : జగద్గిరిగుట్టకొండపై వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని పద్మావతి, అలివేలు అమ్మవార్లకు కుటుంబసభ్యులతో కలిసి వెండి ఆభరణాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ జగన్

డ్రైనేజీ సమస్యలు తక్షణమే పరిష్కరించండి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, అక్టోబర్ 11: ఇందిరానగర్‌లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జలమండలి అధికారులకు సూచించారు. శుక్రవారం బాలానగర్ డివిజన్ పరిధి ఇందిరానగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, జలమండలి అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరానగర్ వాసులకు తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచూ ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యల శాశ్వత పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకొని పనులు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ సమస్యలు ఉన్న దగ్గర కొత్త పైప్‌లైన్‌లు వేయాలని సూచించారు.

ఇందిరానగర్‌లో పర్యటించి సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

కార్మికులకు దుస్తుల పంపిణీ

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 11:వివేకానందనగర్ కాలనీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, పారిశుధ్య, ఎంటమాలజీ, ఎలక్ట్రికల్, జలమండలి సీవరేజీ సిబ్బంది, కార్మికులకు దసరా పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం జీహెచ్‌ఎంసీ, జలమండలి సిబ్బంది అందిస్తున్న సేవలు గొప్పవన్నారు. వినాయక చవితి, బతుకమ్మ, నవరాత్రోత్సవాలు, దసరా పండుగల సందర్భంగా ఆయా విభాగాల సిబ్బంది, పారిశుధ్య కార్మికులు.. వారి కుటుంబాలకు దూరంగా ఉంటూ..ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించడం జరుగుతుందన్నారు. నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న వారిని గౌరవించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నేతలు ఉన్నారు.

వివేకానందనగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ, జలమండలి సిబ్బంది, కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రోజాదేవిరంగారావు దంపతులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, అక్టోబర్ 11: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. 50 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.21లక్షల చెక్కులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శుక్రవారం అందజేశారు. ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా సీఎంఆర్ఎఫ్ నిలుస్తుందన్నారు. నియోజకవర్గానికి చెందిన 50 మంది లబ్ధిదారులతో పాటు పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం

ఉప్పల్‌మినీ శిల్పారామంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతిభ రాజ్‌గౌడ్ శిష్యబృందంతో నిర్వహించిన కూచిపూడి భరతనాట్యం పలువురిని ఎంతో ఆకట్టుకుంది. మహాగణపతి, శ్రీశారదాంబ, ఓం కారరూపిణి, అఖిలాండేశ్వరీ, జనుతశబ్దం, బతుకమ్మ పాట, అంబాష్టకం, దేవీస్థుతి, మహిషాసుర మర్ధిని, బ్రహ్మాంజలి, సరస్వతి స్తుతి తదితర కీర్తనలు అలరించాయి, ఈ కార్యక్రమంలో సాయిహాన్సిక, పునీత, లాస్యశ్రీ, స్మిత, సంయుక్త, సహస్ర, నిత్యశ్రీ, రితిక, ఆరాధ్య, హాన్విక, రోహిణి, గౌతమి, శాన్వి, గాంగన, పూర్వి, సుధీక్ష, రంజనీ, వేదశ్రీ పాల్గొన్నారు.
– రామంతాపూర్, అక్టోబర్ 11

ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

మాదాపూర్‌లోని శిల్పారామంలో సారీస్ ఆఫ్ ఇండియా, దసరా, బతుకమ్మ ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. బెంగళూరుకు చెందిన ఐక్యం డాన్స్ కంపెనీ కళాకారులు గణేశా పంచరత్న, కంజదళయాదాక్షి, దేవి స్తుతి, ఓంకార రూపిణి, తిల్లాన అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి ఆకట్టుకోగా, శంకరానంద కళాక్షేత్ర నిర్వహకులు పద్మశ్రీ డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ శిష్య బృందం నలభై మంది కళాకారులు 'శ్రీ' నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. *– కొండాపూర్, అక్టోబర్ 11*

కార్మికులకే అడ్డా స్థలాన్ని కేటాయించాలి

నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, కార్మికులు

జగద్గిరిగుట్ట, అక్టోబర్11: కార్మికులకు వినియోగించాల్సిన స్థలాన్ని వేరే అవసరాలకు కేటాయించడం తగదని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. సమస్యపై శుక్రవారం జగద్గిరిగుట్టలో శుక్రవారం నిరసనకు దిగారు. ఇక్కడి లాస్ట్‌బస్టాపులో దశాబ్దాలుగా భవన, ఇతర రంగాల కార్మికుల అడ్డా కొనసాగుతున్నది. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో అడ్డుగా ఉండటంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో హెచ్‌ఎంటీ ఖాళీ స్థలంలో తాత్కాలిక అడ్డా ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్థలాన్ని కేటాయించాలని రెండు నెలల కిందట మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వగా.. పరిశీలన చేపట్టారు. ఇటీవల అధికారులు అదే స్థలాన్ని బ్లూక్రాస్ సొసైటీకి కేటాయించారు. తమకు అదే చోట అడ్డా ఏర్పాటు చేసి బ్లూక్రాస్‌కు మరో ప్రాంతాన్ని ఎంపికచేయాలని కార్మికులు కోరుతున్నారు.జెండా గద్దెలు తొలగించి స్థలాన్ని చదును చేయడం తగదన్నారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామన్నారు. ఏసు రత్నం, ఉమామహేశ్, ఏఐటీయూసీ, భవన నిర్మాణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో దుస్తులు అందజేత

రజక రిజర్వేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రామంతాపూర్ డాన్ బాస్కో అనాథ పిల్లలకు దుస్తులను పంపిణీ చేశారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపీరజక మాట్లాడుతూ డాన్‌బాస్కో లోని పిల్లలు చదువుతోపాటు చేతి వృత్తులలో ప్రావీణ్యత సాధిస్తున్నారన్నారు. రజక రిజర్వేషన్ సమితి ప్రతి సంవత్సరం పేద పిల్లలకు దుస్తులను అందజేస్తుందన్నారు. *– రామంతాపూర్, అక్టోబర్ 11*

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 11: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 43, వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 85, కాకరకాయ 32, బీరకాయ 38, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 115, క్యారెట్ 38, కాలీఫ్లవర్ 23, దొండ 35, చిక్కుడు 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలుగడ్డ 37, కీరా 21, దోసకాయ 23, సొరకాయ 25, పొట్లకాయ (1) 18, కందగడ్డ 45, ఉల్లిపొరక 60, ఉల్లిగడ్డ 45, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 7 నుంచి 8, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 28, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 10 నుంచి 12, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 360, చింతపండు 140, కరివేపాకు 60గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

సన్మానం

పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మహేందర్‌రెడ్డిని శుక్రవారం చందానగర్ డివిజన్ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రామ్‌రెడ్డి, రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
– కొండాపూర్, అక్టోబర్ 11

జగద్గిరిగుట్ట సీఐగా నరసింహ

జగద్గిరిగుట్ట, అక్టోబర్11: జగద్గిరిగుట్ట నూతన సీఐగా కేతూరి నరసింహ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.. ఈయన సైబరాబాద్ సీసీఎస్ విభాగంలో నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ జగద్గిరిగుట్ట సీఐగా పనిచేసిన క్రాంతికుమార్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.